

జ్ఞాన సరస్వతి ఆలయ పుష్కర మహోత్సవంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

జ్ఞాన సరస్వతి ఆలయ పుష్కర మహోత్సవం

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలోని జ్ఞానసరస్వతి ఆలయ పుష్కర కుంభాభి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజాధికాలలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు మురుకుంట్ల అరవింద్‌శర్మ, నగేష్ కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్, శ్రీనివాస్, ఊర్మిళారెడ్డి పాల్గొన్నారు.



ప్రొఫెసర్ రాజాకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

విద్యాబోధనలో ఆధునిక వ్యూహాలను అనుసరించాలి

● ఐఐటీ భువనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజాకుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆధునిక విద్యాబోధన వ్యూహాలను అధ్యాపకులు అనుసరించాలని ఐఐటీ భువనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ. రాజాకుమార్ సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజాకుమార్‌తో పాటు కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజాకుమార్ మాట్లాడుతూ పాఠ్యాంశాలను విద్యార్థులు అర్థం చేసుకునేలా ఆధునిక బోధన పద్ధతులను పాటించాలన్నారు. డిజిటల్ అభ్యాసం, డిజిటల్ పెడగాగీ, పరిశోధన ఆధారిత బోధనా విధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరావు, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ సుజాతానాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు, మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సూదిని వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాంతారెడ్డి, కోశాధికారి మురళీధర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మట్టి రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారుస్తున్నాం : కొప్పుల

హయత్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో మట్టిరోడ్లు లేకుండా రోడ్లను సీసీగా మారుస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లోని బొమ్మలగుడి నుంచి కుంట్లూర్ రోడ్డు వరకు ఉన్న మట్టిరోడ్డును రూ.23లక్షలతో సీసీ రోడ్డుగా నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తున్నామని పేర్కొన్నారు. స్థానికంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు వల్ల దుర్గానగర్, శివంహిల్స్, విష్ణునగర్, ప్రగతినగర్, ప్రియదర్శిని, విజయనగర్‌కాలనీలకు రోడ్డుసౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు.

కాలనీల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ రాగుల



పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ శ్రీశ్రీనివాసపురం, క్రిస్టియన్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. కాలనీవాసులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



జలమండలి జీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్

డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పలు డివిజన్లలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వెంటనే నిధులు మంజూరు చేసి వాటి పరిష్కారానికి సహకరించాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో సోమవారం ఎండీని కలిసిన ఆమె సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థనే లేదని, పలు కాలనీల్లో డ్రైనేజీ పైపులైన్లు వేసి నెలలు గడుస్తున్నా సీసీ రోడ్లు వేయకపోవడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలు సాగించలేని స్థితిలో ఉన్నాయన్నారు. పలు కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి కాలం సమీపించినందున వెంటనే తాగునీటి పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేడీనగర్ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వసంత పంచమి వేడుకల్లో అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన జ్ఞానసరస్వతి



జ్ఞానసరస్వతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

● చిన్నారులకు అక్షరాభ్యాసం

చంపాపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని సరస్వతీదేవి ఆలయంలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని వేద పండితులు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 800 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు ధ్యానాంజయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎస్ లావణ్య, మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నల్లా రఘుమారెడ్డి చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలను అందజేశారు. వసంత పంచమి వేడుకలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్‌కాలనీలో..

ఎల్‌బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలో జ్ఞానసరస్వతి ఆలయంలో వసంతపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిమాతకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ వరప్రసాద్, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి రాములు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజీవరెడ్డి, అరవింద్‌కుమార్, లక్ష్మయ్య, రమణ, వాసవీ, కరుణ పాల్గొన్నారు.

వనస్థలిపురం : వసంత పంచమి వేడుకలు వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్కేడీనగర్ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేద పండితులు వంశీకృష్ణ చేత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీహెచ్.వీ.ఆర్.కే మూర్తి, ఆలయ చైర్మన్ సామారెడ్డి, కార్యదర్శి జానకిరామ్, భావన శ్రీనివాస్, కృష్ణ కుమారి, కామేశ్వర్‌రావు, దివ్యాన్ పాల్గొన్నారు.

సైదాబాద్, మాదన్నపేటలలో..

సైదాబాద్ : వసంత పంచమి పురస్కరించుకుని సోమవారం సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. మాతృశ్రీ కాలనీలోని శ్రీవిజ్ఞానవర్థిని స్కూల్‌లో సరస్వతీదేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సైదాబాద్ మూడుగుళ్ల వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు

కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు అన్యాయమే జరిగింది

● రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నప్పటికీ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయమే జరిగిందని తెలంగాణ రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల చూపిన వివక్షను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బీజేపీకి చెందిన 8మంది ఎంపీలను గెలిపించినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో నిధులు సాధించలేకపోయారన్నారు. ఇది ఎంపీల అసమర్థతకు నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చిన బీజేపీ ఎంపీలు గెలిచాక రాష్ట్రానికి ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మూసీని ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా తీసుకుని అభివృద్ధి చేయాలనుకుంటే బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాలేకపోయారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.



రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

తెలంగాణపై కేంద్రం వివక్ష : పారిజాతారెడ్డి ఆరోపణ

సరూర్‌నగర్ : కేంద్రం తెలంగాణపై తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నదని, బడ్జెట్‌లోని కేటాయింపుల లెక్కలే ఇందుకు నిదర్శనమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడానికి వ్యతిరేకంగా సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె తరలివెళ్లారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ బీహార్, ఏపీలకు ఇచ్చిన ప్రాధాన్యత బడ్జెట్‌లో తెలంగాణకు ఇవ్వలేదని, ఇక్కడి ప్రజల సమస్యలపై బీజేపీకి చిత్తశుద్ధి లేదనడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని విమర్శించారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, వారిలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రం పరిస్థితి గుండు సున్నా అన్నట్టుగా తయారయిందని ఆమె ఎద్దేవా చేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో మాజీ మేయర్ పారిజాతారెడ్డి

కాలనీలో ఆత్మీయ సమావేశం

బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని శ్రీసాయిబాలాజీ హోమ్స్ ఫేజ్-2 కాలనీలో కాలనీవాసుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాజీ మేయర్ చిగిరింత నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. గడిచిన ఐదేళ్లలో తమ కాలనీ అభివృద్ధికి ఆమె ఇతోధికంగా కృషి చేశారని ఈ సందర్భంగా కాలనీవాసులు కొనియాడారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిందని సీపీఎం హైదరాబాద్ సబ్ జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు జి.విఠల్, పి.నాగేశ్వర్‌రావు, ఎల్.కోటేశ్వర్‌రావు, ఎమ్.మీనా, కోటయ్య అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది వికసిత్ భారత్ బడ్జెట్ కాదని కేవలం కార్పొరేట్ బడ్జెట్ మాత్రమేనని విమర్శించారు. రాష్ట్రాలకు సంబంధించిన నిధులు అన్నీ కేవలం బీజేపీ పాలిత ప్రాంతాలకు కేటాయించి చేతులు దులిపేసారన్నారు. కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలునాయక్, అబ్దుల్ సత్తార్, లక్ష్మమ్మ, కిషన్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

బడ్జెట్‌లో విద్యారంగానికి.. : శంకర్

హయత్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి. శంకర్ అన్నారు. సోమవారం హయత్‌నగర్ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యను కార్పొరేట్, ప్రైవేటీకరణ వైపుకు తీసుకువెళ్లారని అన్నారు. గతంతో పోల్చుకుంటే కేవలం 2శాతం మాత్రమే పెంచారని గుర్తుచేశారు. పెంచిన 2శాతం నిధులు ఏమాత్రం సరిపోవని అన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా బడ్జెట్ ఉందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, నాయకులు వేణు, ప్రణయ్, మహేష్, ఆశ్రిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ఓల్డ్‌మలక్‌పేట : వికలాంగుల స్వయం ఉపాధి యూనిట్ల సంఖ్య పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని మండలానికి 25యూనిట్లు మంజూరు చేయాలని యూనిట్ రుణం ఒక లక్ష వరకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా అనంతరం పీడీ అరుణకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె.వెంకట్, ఎం.అడివయ్య, వరమ్మ, ఆర్.వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీ సైదాబాద్ అధ్యక్షుడిగా సూరజ్

సైదాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గం బీజేపీ సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా సూరజ్ అప్పింగికర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఎన్నికల అధికారి బంగారు శృతి ప్రకటించారు. ఈ సందర్భంగా సూరజ్ మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి డివిజన్‌లో పార్టీ పటిష్టతకు పాటుపడుతానని అన్నారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో మరోసారి సైదాబాద్ డివిజన్‌ను బీజేపీ కైవసం చేసుకునేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్ : బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సభ్యుడైనా మండలంలోని పిగ్లీపూర్ గ్రామానికి చెందిన దుర్గం మల్లయ్య 2020 సంవత్సరంలో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులకు సోమవారం సంఘం ద్వారా చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ రూ. 15వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తుందని భరత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ మొగుళ్ల యాదిరెడ్డి, నాయకులు మధు, కృష్ణ గౌరిశంకర్, బాలకృష్ణ, ఆనంద్, అకౌంటెంట్ రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి ఐదున్నర తులాల బంగారు గొలుసు అపహరణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): షాపులో ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు ఐదున్నర తులాల బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన మీర్ పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మీర్‌పేట్ లోని టీఎస్‌ఆర్‌నగర్ కాలనీకి చెందిన ఉడతల యాదమ్మ(65) అనే వృద్ధురాలు స్థానికంగా ఓ చిన్న బట్టల దుకాణం నడుపుతోంది. సోమవారం మధ్యాహ్నం ఆమె షాపులో ఉండగా, గుర్తు తెలియని దుండగుడు షాపులోకి వచ్చి ఆమె ముఖం పై ఏదో ద్రావకం చల్లి, ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాలమాదిగల సమష్టి పోరాటాలతోనే హక్కుల సాధన

సైదాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు సాధించాలంటే మాలమాదిగలు సమష్టిగా పోరాటాలతోనే సాధ్యమవుతుందని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణ తెలిపారు. మలక్‌పేట చావుని నాదర్‌అలీ బేగ్‌లో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాలమాదిగలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. గత పదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయలేదని చెప్పారు. మాలమాదిగలు కలిసుంటేనే అభివృద్ధి సాధ్యమవతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పటేల్ విశ్వప్రకాశ్, నాగునూరి కృష్ణ, నారాయణరావు, పటేల్ విజయ్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపీ మంద జగన్నాథంకు శ్రద్ధాంజలి ఘటించారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నేతలు

నూతన కార్యవర్గం..

నాదర్‌అలీబేగ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, శివకుమార్, శివశంకర్, కార్యదర్శిగా రాకేష్, సహాయ కార్యదర్శిగా జయవర్ధన్, కోశాధికారిగా సురేష్, సహాయ కోశాధికారిగా సతీష్‌కుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా భగత్, ప్రీతం, సంజయ్, సాయి అమృత్‌కుమార్, శశాంక్, కిరణ్‌కిశోర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీలు రాజ లింగేశ్వర్ రావు, సిద్దార్థ్, ఎడ్యుకేషన్ సెక్రటరీ ఉమా శంకర్, దీపేందర్, సలహాదారులుగా తిరుమలరావు, సుదర్శన్‌చ అమర్‌నాథ్ ఎన్నికయ్యారు.



రైతుబజార్‌లో విక్రయదారుతో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రైతుబజార్లలో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తాం

● మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గంతో కలిసి ఆయన సోమవారం సరూర్‌నగర్ రైతుబజార్‌ను సందర్శించి రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్లలో దళారీ వ్యవస్థ ప్రమేయం లేదన్నారు. స్టాల్స్ ఉన్న రైతులు తాము పండించిన పంటను నేరుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుబజార్లలో అధికారులు సూచించిన ధరలకు విక్రయించాలన్నారు. రైతుబజార్ పరిసరాలలో కొందరు దళారులు, వ్యాపారులు రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తూ తమకు నష్టం కలుగజేస్తున్నారని రైతులు చైర్మన్ ఎదుట తమ గోడును వెలబోసుకున్నారు. రైతులకు నష్టం కలిగించే వారిని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. అధికారులు రైతులు, వినియోగదారులతో సమన్వయంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు బండి మధుసూదన్‌రావు, పన్యాల జైపాల్‌రెడ్డి, మెగావత్ గణేష్‌నాయక్, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, దోమలపల్లి అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి స్రవంతి పాల్గొన్నారు.

ఆగిన గుండెను పరుగెత్తించేందుకు సీపీఆర్ దోహదం



కోడ్ బ్లూ లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఆగిన గుండెను తిరిగి పరుగెత్తించడంలో అత్యవసర ప్రాథమిక చికిత్సగా సీపీఆర్(కార్డియో పల్మనరీ రిససిటేషన్) ఎంతగానో దోహదపడుతుందని, ఈ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'కోడ్ బ్లూ'ను ఏర్పాటు చేయడం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. సీపీఆర్ విధానంను గూర్చి ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా సామాజిక సేవకులు దోసపాటి రాము, యశస్వినీ జొన్నలగడ్డ ఇద్దరూ 'కోడ్ బ్లూ'ను స్థాపించారు. ఇందుకు సంబంధించిన లోగోను సోమవారం జయప్రకాశ్ నారాయణ చేతులమీదుగా వారు ఆవిష్కరింపజేశారు. ఎవరికైనా హార్ట్‌ఎటాక్ వచ్చినప్పుడు సరైన అవగాహనతో సీపీఆర్ చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని, ఈ సీపీఆర్‌ను ఎలా చేయాలనే అంశంపై కోడ్ బ్లూతో పూర్తిగా అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



రవీందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సహారా ఎస్టేట్స్ రెడ్డి కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్ రెడ్డి కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెరువాల జగత్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సి.బాల్‌రెడ్డి, న్యాయ సలహాదారుడిగా ఎ.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా గిల్లాల అనంత్‌రెడ్డి, కోశాధికారిగా మారెడ్డి కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ముచ్చా శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.